# స్వంత కొంప

మా యిల్లు ఊరిబైట ఉన్నది. బజారుకు చాలా దూరము. బజారు కేమిటి దేనికైనా దూరమే.

కాస్త శొంఠికొమ్ము కావాలంటే మైలుదూరం నడిచిపోయి కొనుక్కోవలసిందే కాని ఈ మధ్య దొరకదు.

పక్కయింటివాళ్ళు ఎవ్వరైనా ఇయ్యగాలంటే అదేమి ఖర్మమోగాని ప్రక్క ఇళ్ళల్లోనే కాదు, అటు పదీ ఇటుపదీ ఇళ్ళల్లో, మాయింట్లో ఏది ఉండదో, వాళ్ళ ఇళ్ళల్లోనూ అదే ఉండదు.

“ఓ గిన్నెడు నెయ్యిఉంటే పోస్తావు అక్కయ్యా” అని వెళుతుంది మా ఆవిడ. ఆ పక్కఇంటి ఆవిడ ముఖం ఇంత జేసుకొని ‘అయ్యో, అడక్క అడక్క ఇవ్వాళే అడిగావు! నిన్ననే గిన్నె కాలేశాను అమ్మాయ్, నీవు ఎప్పుడూ అడిగేదానవు కావు. నీవు అడక్క అడక్క అడగటమూ మా యింట్లో లేక పోవటమూనూ! బాగానే ఉంది!’ అని దీర్ఘాలుతీస్తూ విచార పడుతుంది.

‘నేనైనా అడక్కపోదును అక్కా. కాని ఏమైంది అంటే ఇవ్వాళ ఓ చుట్టము వచ్చారు. మనమైతే ఎట్లాగైనా సద్దుకుపోతాము. చుట్టానికికూడా పట్టికూడదు ఎట్లా పెట్ట సమ్మా! ఏమంటావ్?’ అని మా ఆవిడ సంభాషణ

మొదలు పెడుతుంది. మొగుడుకి అయితే ఎలాగైనా, అంటే నెయ్యిఉన్నా లేకపోయినా పెట్టవచ్చుననీ పరాయి పెద్దమనిషికి అలాగ పెట్టటం చాలా అసహ్యమైనపనిఅనీ, ఆవిడా ఈవిడా కలిసి నిర్ణయిస్తారు.

"రెండు రోజులనుంచి నెత్తిన నోరు పెట్టుకొని అరుస్తుంటే, ఆయన పట్టించుకోందే, నేను ఎలాగ చచ్చేది చెప్పూ? అంటుంది మా ఆవిడ. ఆవిడా సరిగ్గా అలాగే చెపుతుంది ఆమెకూడా మొత్తుకొంటూనే ఉన్నదట—వాళ్ళ ఆయనకూడా వినటంలేదట'.

సరే దాని తరువాత ఈ మగవాళ్ళేమీ ఇంటి గొడవలు పట్టించుకోకుండా తిరగటాన్ని గురించి కొంత సంభాషణ జరిగిన తరువాత, 'వెళతా నక్కా ఆయన వచ్చే వేళ అయింది' అంటూ వచ్చేస్తుంది మా ఆవిడ—ఇలాగ ప్రతి విషయంలోనూ అవస్థగా ఉంది.

దీని కేదో ఉపాయం ఆలోచించాలె. ఈ పేటలో ఒక కోమటికొట్టు పెట్టిస్తే బాగుంటుంది ఏది కావలిస్తే అది కొనుక్కోవచ్చు. అనుకొని ఒకణ్ణి బ్రతిమిలాడి పెట్టిస్తే వాడు మూడు నెలలు ఉండి, ఒకరూ కొనలేదనీ, కొన్నవాళ్ళు ఎవ్వరూ ఒక దమ్మిడీ అయినా ఇయ్యలేదని గోలపెట్టి వెళ్ళిపోయినాడు.

ఇల్లు తీసికెళ్ళి నడి బజారులో కట్టుకోముగదా మరి ఏమిటి ఉపాయం ?

ఒకబండి కొనుక్కుంటే అన్ని ఇబ్బందులూ తీరిపోయే లాగన కనిపించింది.

ఏమిటో ఎంతడబ్బు ఖర్చుఅవుతున్నది ? అనేక నాళ్లు బజారుకెళ్ళి ఏదో ఒక సవాశేరు వంకాయలో, దోసకాయలో, కొని వానలా కూలిపెట్టి తీసుకొస్తున్నాను. ఎండగా ఉంటే ఇంకో పేడ వాతేపోయిందని ఆరు అణాలుఇచ్చి బండెక్కి వచ్చిన రోజులూ ఉన్నవి ! ఇంకా దేముడుచాలా మేలుచేస్తే అనేక రకాలుగా డబ్బు ఖర్చుఅవుతున్నది అనుకోండి. స్కూలుకు రోజు నడిచి పోతూన్నానన్న పేరేగాని ఆ చౌకుగాకానేగా పోవటం ? అక్కడనుంచి బండెక్కి పోతూనే ఉంటిని ! ఆ చౌకు దాకాఅయినా నడవటం ఎందుకూ అంటే ఇంటావిడ నేను స్కూలుకు మైలుదూరమూ నడిచే వెళుతున్నానని అనుకోటానికి ! వచ్చేటప్పుడు సరే చచ్చినట్లు ఆ మూలనుంచి ఈ మూలకు నడుస్తునే ఉన్నాను.

ఒకబండి కొంటినా ఈ ఖర్చులన్నీ తప్పుతయ్యి.

అయితే ఏ బండి కొనుక్కోవాలె అన్నది ప్రశ్న. జట్కా భరించలేము. గుఱ్ఱాన్ని తోమాలె. ఆ పని అంతా ఎవడుచేస్తాడు ? రెండెడ్ల బండి కొనుక్కోంగదా ! ఇక ఎటొచ్చీ ఒంటెద్దు బండి కొనాలె కొనటంఅంటూవస్తే!

మా ఆవిడతో ఈ విషయం ఎత్తితే ఆవిడ ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

సరే కొందామా అని గట్టిగా ఆలోచించ సాగాను. కొంటే, బండీ ఎద్దుకూడా మూడు వందల్లో వస్తయ్యి. మనకు కావలసినపుడు ఉపయోగించుకొంటూ అక్కర్లేనపుడు కిరాయికి త్రిప్పితే దానికయ్యేఖర్చు అదే సంపాదించు కొంటుండీ అని మా ఆవిడకు చెప్పాను.

ఆ ఉపాయం ఆవిడకేమీ నచ్చలేదు. అదేమన్న మాటండీ, ఫలాని వారి బండి బాడుగకు తిరుగుతున్నదీ అంటే మనమకేన్నా మర్యాదగా ఉంటుందా ? ఎబ్బే ! అట్లాంటిపని చేసేకంటే ఊరుకొంటే మేలు అని నిరసనగా అన్నది.

అక్కడికి నేను ఎంతో మర్యాదగా చెప్పాను—ఎద్దును మేపటానికి ఓ పాతిక రూపాయలు చులాగ్గా అవుతయి. ఎటొచ్చీ ఒక మనిషి ఉండాలెగదా, వాడికి అన్నంపెట్టి పది రూపాయలైనా ఇవ్వాలె, మొత్తము ముప్ఫయి ముప్ఫై అయిదు రూపాయలు అవుతవి, అంత పెట్టుకో గలమా ? ఏదో బాడుగకు త్రిప్పితే మనకు అయిన ఖర్చు వస్తుంది. చేతిలో బండీ ఉంటుంది అని చెప్పాను.

మా ఆవిడకు బండి కిరాయికి త్రిప్పటం ససేమిరా ఇష్టంలేదు. అది అప్రదిష్ట పనిట. ఎవ్వరూ అల్లాగ చేయరట!

'బోలెడుమంది చేస్తారు' అని నేనూ,

'చెయ్యరు' అని ఆవిడా.

కాసేపు పోట్లాడుకొన్నాము. చివరకు తేలిన విషయం ఏమిటాఅంటే ఒంటెద్దుబండిని బాడుగకు త్రిప్పటం అనేది

మర్యాద కాదని నేను ఒప్పుకోవాలిసి వచ్చింది. అయితే ఒకటి కారు అయితే కిరాయికి త్రిప్పినా గౌరవానికి ఏమీ భంగం లేదని ఆమె అంగీకరించింది.

కారుకొంటే మనముదాన్ని భరించ గల్గుదుమా అని పెట్రోలుకు మరమ్మతులకు మొత్తంమీద కారుకని ఎంత ఖర్చు పెట్టవలసి ఉంటుంది అని విచారించాను, కారుగల వాళ్ళనే అడిగాను. 'బండి పెట్టుకొంటే ఎంత అవుతుందో కారు పెట్టుకొన్నా అంతే అవుతుంది, అయిదారు రూపాయలు అటూ ఇటూ! అంతే, అన్నారు.

మరి డ్రైవరుకి ఇవ్వాలిగదా ఏ యాభైయో అంటే, వాళ్లు నవ్వి ఇప్పుడు డ్రైవరును ఎవరు పెడుతున్నారయ్యా స్వంతంగా నడపటం నేర్చుకో అన్నారు.

ఇంతకూ బండికొన్నా ముప్పై రూపాయలు అవుతూనే ఉంది! ఇంకో అయిదో ఆరో అయితే అయింది, కారు కొనటమే మంచిదని నిశ్చయించాము.

కారుకొని మనకు కావలసినప్పుడు ఉపయోగించుకొని మిగతా సమయాల్లో కిరాయికి తిప్పటానికి మా ఆవిడకూడా ఒప్పుకొన్నది, అందుకు నేను చాలా సంతోషించాను.

/ఇక ఎటొచ్చీ వచ్చిన పెద్ద ఇబ్బంది అలా కారుకొంటానికి డబ్బు ఏదీ అని! ఎంతలేదన్నా రెండు మూడు వేలు కావాలె, కొంత ఆలోచించిన మీదట అదికూడా ద్రపె

యిబ్బందిలాగ కనపడలేదు. ఎందుకంటే వాయిదాలమీద తీర్చే పద్ధతి మీద కారు అమ్ముతారు కావాలా అంటే.

కారు అద్దెకు తిప్పితే నెలకు ఎంతలేదన్నా ఓ వంద రూపాయలు దొరక్కమానవు అన్ని కర్చులూ పోను.

అది కంపెనీ వాడికి కడితే కొద్దిరోజులలో బాకీ తీరటమే కాక కారు మనకు మిగిలిపోతుంది.

మా ఆవిడ ఊరికే విని ఊరుకొంది ఇదంతా నేను చెప్తూవుంటే !

'కారు మనకు మిగిలి పోవటంఅంటే—కారు మనకు దమ్మిడీ ఖర్చులేకుండా వచ్చినట్లు తెలిసిందా ?' అన్నాను.

అప్పటికీ ఆమెగారు ఏమీ ఆశ్చర్యపడనూ లేదు సంతోషమూ కనపర్చలేదు, చివరకు అన్నది—'డ్రైవరును పెట్టవద్దూ కారు అద్దెకు తిప్పాలంటే ?

'పెట్టాలి'

ఈ మాటవిని కాంతం పకపకా నవ్వి 'డ్రైవరుకు ఏమిస్తారు మీరు ఏమి మిగుల్చుకొంటారు ? అని హేళనగా నవ్వింది.

అంత హేళనగా నవ్వితే ఎవరికైనా కోపం వస్తుంది. కాని ఇప్పుడు నేను చాలా శాంతంగా ఉంటున్నాను కదూ. అందుకని ఏమీ అనలేదు. నేనూ నవ్వి ఊరుకొన్నాను.

మా వూళ్ళో చాలామంది డ్రైవర్లు ఉన్నారు. ఎవరినో ఒకరిని పిలుస్తాను—ఏ అబ్బాయ్ ఈ కారు నీవు

తీసుకో. నీయిష్టం వచ్చినట్లు కాడుగకు త్రిప్పుకో. నా ఉప యోగానికి మటుకు ప్రొద్దునొకసారీ సాయంత్రం ఓసారీ తీసుకొనిరా, నెలకు నాకు వంద రూపాయలు ఇయ్యి, అంటే ఎవరు బడితే వాళ్ళే యిస్తారు—ఆ వందా కంపినీ వాడికి పంపేస్తాను అని ఇల్లాగ ప్లాను వేసుకొని ఒక కేటలాగు తెప్పించి ఈ కార్లను గురించి భోగట్టా అంతా తెలుసుకొన్నాను. కార్లలో బేబీ ఆస్టిన్ కారు చాలా సౌఖ్యంగా ఉండటమే కాకుండా చాలా చౌకలో వస్తుంది, పెట్రోలు కూడా అట్టే తాగదు. ఆ తరువాత కంపినీ వారికీ నాకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినవి.

ఇది ఇప్పటి సంగతి కాదు. సుమారు పదిహేను ఏండ్ల క్రిందటి సంగతి. ఆ రోజులు కాబట్టి రెండు వేలకే ఒక చిన్న కారు ఇయ్యటానికి ఒప్పుకొన్నారు. వాయిదాల మీద తీర్చడానికికూడా అంగీకరించాము.

అయితే ఎన్ని వాయిదాలమీద తీర్చమంటారు, ఎన్ని సంవత్సరాలలో ఈ అప్పుతీరుతుంది అని నేను అడిగాను.

కంపినీవారు ఈ ప్రశ్నకు గడుసుగా జవాబుఇచ్చారు. ఏమని అంటే, ఎన్ని సంవత్సరాలలో తీరుతుంది అన్నప్రశ్నకు మీరే సమాధానం చెప్పుకోవాలె. మీరు నెలనెల ఇచ్చే మొత్తంమీద ఆధారపడి ఉంటుంది అన్నారు.

నేను ఊరుకోన్నానూ! మళ్ళీ వ్రాశాను. అయితే నెలకు ఎంత మొత్తం కట్టమంటారు. ఆ విషయంలో మీరు ఏమైనా వత్తిడి చేస్తారా అని అడిగాను.

నెలకు ఎంత మొత్తం కట్టాలన్న విషయం కూడా మీరే నిర్ణయించుకోండి—అది మీ ఆర్థిక దార్ఢ్యము మీద ఆధారపడి ఉంటుంది. అన్నారు.

సరే, ఇంకేం అన్నీ అనుకూలంగానే ఉన్నాయి కాని కంపెనీ వారికి నెలనెలా కట్టవలసిన మొత్తాన్ని గురించి మళ్ళీ కాస్త ఆందోళన పడ్డాను. వాళ్ళేమో నెలకు ఇంత కట్టాలని నిర్బంధంచేయక పోయిరి. నేను మటుకు వంద ఇస్తాను. రెండు వందలిస్తానూ అనీ ముందుగానే ఎందుకు అనాలె ?

ఒక డ్రైవరుకి కారు ఇచ్చేసి నెలకు నాకు నూరు రూపాయలు ఇయ్యి అబ్బాయ్ అని అనుకొన్నమాట నిజమే! వాడు అల్లాగ ఇయ్యవచ్చు ఇయ్యకపోవచ్చు. ఇచ్చినా ఆ వందా కంపెనీ వారికి కట్టటం ఎందుకూ !

ఏ పదోకట్టి మిగతాది నేనే వాడుకోకూడదా అని ఓ ఆలోచన వచ్చింది.

ఆలోచించగా ఆలోచించగా అదే చాలా మంచి ఏర్పాటు అని తోచింది,

సరే అనుకొని వెంటనే కంపెనీకి వ్రాసేశాను. ఒక కారు పంపవలసదనీ డబ్బు నెలకు పదిరూపాయలు చొప్పున

ఇస్తానని అలాగే కాయితం వ్రాసి ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నా నని కూడా తెలియజేశాను.

మా ఆవిడతో కూడా చెప్పేశాను కారు వస్తుందని.

డ్రైవరును కుదిర్చారా ? అంది.

కుదిర్చాను అన్నాను.

అయితే...ఎట్లా...రోజుకు రెండుసార్లు మనకు ఇచ్చే టట్లా ?

అవును.

రెండుసార్లూ అంటే ? అని ఆవిడ ఏదో ఆలోచిస్తున్నది. రెండుసార్లూ అంటే ఏముందీ ప్రొద్దునొకసారి, సాయంత్రం ఒకసారి అని చెప్పాను.

అయితే మీరు స్కూలుకు వెళ్ళటానికి రావటానికి సరిపోతుంది—అంతేగా ?

అవునన్నాను నేను.

అయితే నేను మా అక్కయ్య గారింటికి వెళ్ళాలంటే?

నేను స్కూలుకు వెళ్ళేటప్పుడే నాతో రా. నిన్ను అక్కడదించే నేను స్కూలుకు పోతాను.

అట్లా. ఎట్లా వీలు అవుతుందండీ......మీరు పది గంటలకే స్కూలుకు వెళ్ళిపోతారాయె నాకు అది పనివేళ ఆయె ఎట్లాండీ ? అని గునిసింది—

మరి ఎప్పుడు కావాలంటావూ ?

రెండింటికో మూడింటికో కావాలె.

మూడు గంటలకు కావాలంటె ఎట్లావస్తుంది, అప్పుడు మన కారు ఊళ్ళో బాడుగకు తిరుగుతూ ఉంటుంది.

ఎట్లా మరి నాకు కారు ఇయ్యరా ?

జాలివేసింది. ఇంతా కోరుకొని ఇంటికైన మనిషికి ఇయ్యకపోతే ఎట్లా ?—ఇద్దామా అంటె అది రైళ్ళువచ్చే వేళ. కిరాయికి తిరిగే వేళా నాయెను. అందుకని బ్రతిమాలుతూ అన్నాను—నివ్వుకూడా నేను వెళ్ళేటప్పుడే రావే, లేకపోతే నా యింత్రం అయిదుగంటలకు...ఎట్లాగో...వీలుచేసుకో—

ఎలా వీలు అవుతుందండీ ?

నేను చెప్తాను విను, మీ అక్కయ్యగారి ఇంటికి వెళ్ళదలుచుకొన్న రోజున పెందలాడే వంటచేసి నాకు పెట్టి నివ్వూ/పిల్లలూ తిని పది గంటలకల్లా రెడీగా ఉండండి. నిన్ను తీసుకెళ్ళి అక్కడ దింపి నేను స్కూలుకు వెడతాను. అయిదు గంటలకు ఎట్లాగూ కారు నాకోసం స్కూలుకు రావాలెగా, అప్పుడు నిన్ను ఎక్కించుకొని వచ్చే ఏర్పాటు చేస్తాను. అంతే గాని ఎటుగాని వేళ మధ్యాహ్నం ఇయ్యమంటే ఎలాగ చెప్పూ, ఇల్లాగ బ్రతిమిలాడి చెప్పినావినక ఆమె తనకు మధ్యాహ్నం మూడుగంటల వేళకే కారు కావాలాఅని పట్టు బట్టింది. నేను మటుకు ఎంత సేపని ఓపిక పట్టేది. కాసేపు చూశాను పోనీ సరే నంటుందేమోనని, కాదు కూడదు ఆ వేళనే కావాలన్నది. నాకు విసుగుపుట్టి, ఊఁహూ ఆ వేళప్పుడు ఇయ్యడానికి వీల్లేదే ! అని నిక్కచ్చిగా చెప్పేశాను.

ఆవిడకూ బాగా కోపం వచ్చింది కామోలు, వీల్లేక పోతే మీరొక్కరే ఎక్కి ఊరేగండి అని విసుక్కుంటూ వెళ్ళిపోయింది.

ఆ తరువాత పోనీ ఇద్దరకీ వీలైన పద్ధతి ఏదైనా ఉంటే చూద్దామని ప్రయత్నించాను. కాని ఆమె మరీ చెట్టెక్కి కూర్చుంటే నేనేం చేసేది? తను ఎక్కడికైనా వెళ్ళడానికే కాకుండా తనఅక్కా అక్కపిల్లలూ ఎక్కడికైనా వెళ్ళాలన్నా కారు ఆమెకు ఉప్ప జెప్పాలట, అంతేకాదు.

తన అల్లుణ్ణి కూతురిని గుడ్లవల్లేరునుంచి బందరు తీసుకొని రావటానికి పండుగ పండుగకూ కారు పంపాలట!

ఇంకా, తానూ, పిల్లలూ అప్పుడప్పుడు సాయంత్రానికి సముద్రం వైపుకు వెళ్ళి వస్తూఉండాలట! ఇష్టమైతే నేను కూడా తమతో రావచ్చునట!

మొత్తంమీద ఆ కారు హామేషా ఆమెగారి పర్యటనలకై వినియోగపడాలె నన్నట్లు తేల్చి చెప్పింది.

పోనీ ఆమె చెప్పినట్లే చేస్తే కారువల్ల నాకేమి ఆదాయుంరాదు. నెలకు పది కట్టాలె పోనీలే అట్లాగే చేద్దాము అనుకొని మనస్సుకు సమాధానం చెప్పుకొన్నాను.

నెలకు పది కడితె సంవత్సరానికి నూటఇరవై అవుతుంది—ఇరవై ఏండ్లలో అప్పుతీరిపోతుంది. ఈ ఇరవై ఏండ్లు కారు నాయిష్టంవచ్చినట్లు వాడుకోవచ్చు అని సంతోషించాను.

సంతోషించటమే కాకుండా స్నేహితు లందరికీ చెప్పాను. అంతా సంతోషించారు. అన్నీ సిద్ధంజేసుకు కూర్చున్నాము. కానీ కారు పంపలేదు. ఆ కంపినీవాళ్ళు ఎందుకు పంపలేదో నాకూ అర్ధంకావటంలేదు! గిట్టనివాళ్ళు ఏదో చెప్పి ఉంటారు ఆ కంపిని వాళ్ళతో, ఇంతకూ మాకు స్వంతంగా కారు ఉంచుకొనే యోగంలేకపోయింది...ఏం జేస్తాం!